

వామ్మో.. సెన్సర్

డ్రైవింగ్ లైసెన్స్‌కు చుక్కలు

- వాహనదారుల బెంబేలు
- ఆటోమేటిక్ ట్రాక్‌పై నడిపేందుకు ఇబ్బందులు
- ఇప్పటికీ తగ్గని ఫెయిల్యూర్ శాతం
- టెస్ట్ డ్రైవ్‌కు అవకాశం కోరుతున్న వాహనదారులు



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 25: డ్రైవింగ్ లైసెన్స్ కోసం వెళ్లే వారికి సెన్సర్ కష్టాలు తీరడం లేదు. ఈక్రమంలోనే చాలా మంది డ్రైవింగ్ పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారు. 2022 నుంచి అనంతపురం ఆర్టీఏ కార్యాలయంలో డ్రైవింగ్ పరీక్షల్లో సెన్సర్ సేవలు మొదలయ్యాయి. ఆటోమేటిక్ ట్రాక్‌పై వాహనం ఎలా నడపాలో అవగాహన లేక ఎక్కువ శాతం మంది వాహనదారులు ఫెయిల్ అవుతున్నారన్న అభిప్రాయాలున్నాయి. డ్రైవింగ్ పరీక్షకు ముందుగా ఆటోమెటిక్ ట్రాక్‌పై వాహనం ఎలా నడపాలో స్ర్కీన్ ద్వారా తెలియజేస్తున్నా ఎక్కువ శాతం మంది ఫెయిల్ అవుతుండటం గమనార్హం.

తగ్గని ఫెయిల్యూర్ శాతం

2022 డిసెంబరు మూడో వారంలో అనంత ఆర్టీఏ ఆఫీస్‌లో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో సెన్సర్ సేవలు ఆరంభమయ్యాయి. దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా ఫెయిల్యూర్ శాతం తగ్గడం లేదు. ఇప్పటి దాకా 7120 మంది ద్విచక్రవాహనదారులు డ్రైవింగ్ పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 4824 మంది పాస్ అయ్యారు. మిగిలిన వారు ఫెయిల్ అయ్యారు. లైట్ మోటారు వెహికల్ డ్రైవింగ్ పరీక్ష కోసం 8300 మంది హాజరయ్యారు. ఇందులో 3420 మంది మాత్రమే పాస్ అయ్యారు. హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ పరీక్ష కోసం 640 మంది హాజరయ్యారు. వీరిలో 286 మంది పాస్ అయ్యారు. లైట్ మోటారు వెహికల్, హెవీ వెహికల్ డ్రైవింగ్ పరీక్షల్లోనే ఎక్కువ శాతం ఫెయిల్ అవుతుండటం గమనార్హం.

అవగాహన కల్పించడంలో వైఫల్యం

ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్‌పై వాహనం నడిపే విధానంపై సంపూర్ణ అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. సెన్సర్ ట్రాక్‌లో బ్రిడ్జి ఎక్కే సమయంలో క్రాసింగ్ వద్ద నేరుగా వెళ్లకుండా ముందుకు, వెనక్కి వాహనాన్ని నడపడం, రివర్స్ నడిపే సమయాల్లో ఎక్కువ శాతం ఫెయిల్ అవుతున్నట్లు సమాచారం. కొంత మంది సెన్సర్ ట్యాగ్‌ను నిర్దేశించిన సిగ్నల్స్ వద్ద సరిగా చూపకపోవడంతో ఫెయిల్ అవుతున్నట్లు సమాచారం. మరికొంత మంది సిగ్నల్స్ వద్ద ఒక చోట ట్యాగ్‌ను చూపించి, మరో ప్రాంతంలో వదిలేయడం ద్వారా ఫెయిల్ అవుతున్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో పాటించాల్సిన పద్ధతులపై వాహనదారులకు సరైన అవగాహన కల్పిస్తే ఫెయిల్‌శాతం తగ్గుతుంద ని బాధిత వాహనదారులు కోరుతున్నారు. స్ర్కీన్‌పై వాహనం నడిపే విధానం చూపడంతోనే సంబంధిత అధికారులు సరిపెట్టుకుంటున్నార న్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎల్ఎల్ఆర్ పరీక్ష పాసైన వాహనదారులకు ఆటోమేటిక్ ట్రాక్‌లో వాహనం ఎలా నడపాలి.. ఎక్కడెక్కడ సెన్సర్ సిగ్నల్స్ అమర్చారు..? ఆ ప్రాంతంలో పాటించా ల్సిన పద్ధతులపై అవగాహన కల్పించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు కొన్ని డ్రైవింగ్ స్కూల్స్ యజమాన్యంతో కుమ్మక్కై ఎంపిక చేసిన వారికి మాత్రమే తగిన మెలకువలు ఇవ్వడంపై శ్రద్ధ చూపుతున్నట్లు సమాచారం. మిగతా వారికి కేవలం స్ర్కీన్‌లో చూసి నడపాలని వదిలేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.



టెస్ట్ డ్రైవ్‌కు అవకాశం ఇస్తే ప్రయోజనం

సెన్సర్ ట్రాక్‌పై డ్రైవింగ్ పరీక్షకు ముందు రోజుల్లో టెస్ట్ డ్రైవ్‌కు అనుమతిస్తే ఫెయిల్యూర్ శాతం తగ్గే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలోనే పలువురు వాహనదారులతో పాటు ఓ మాజీ ప్రజాప్రతినిధి ఎల్ఎల్ఆర్ పాసైన వాహనదారులకు ముందస్తుగా టెస్ట్ డ్రైవ్‌కు అవకాశం కల్పించాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారిని కోరారు. ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా సెన్సర్ ట్రాక్‌పై డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం నుంచి ముందస్తు టెస్ట్ డ్రైవ్‌కు అవకాశం కల్పిస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అవసరమైతే టెస్ట్ డ్రైవ్ కోసం నామమాత్రపు ఫీజు వసూలు చేసినా పర్వాలేదన్న వాదనలున్నాయి. అప్పట్లోనే ఇక్కడి నుంచి ట్రాన్స్‌పోర్టు రాష్ట్ర ఉన్నతాధికారులకు టెస్ట్ డ్రైవింగ్ కోసం అనుమతించాలని లేఖ పంపినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై ఇప్పటి దాకా ఎలాంటి సమాధానం లభించనట్లు తెలిసింది. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా తమకు సెన్సర్ ట్రాక్‌పై టెస్ట్ డ్రైవింగ్‌కు అవకాశం కల్పించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.



సెన్సర్ అందించే సంకేతాల ద్వారా ఆటోమెటిక్ ట్రాక్‌లో వాహనం కదలికలను కంప్యూటర్‌లో చూపిస్తున్న దృశ్యం

కరెక్ట్‌గా వాహనం నడిపితేనే పాస్



డ్రైవింగ్ పరీక్షల్లో పారదర్శకత కోసమే ప్రభుత్వం సెన్సర్ సేవలను ప్రారంభించింది. అనంత ఆర్టీఏ ఆఫీస్‌లో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో సెన్సర్ ఇచ్చిన సంకేతాల ఆధారంగా డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. నిబంధనలకు అనుగుణంగా వాహనాన్ని నడిపితేనే పాస్ అవుతారు. లేదంటే ఫెయిల్‌కాక తప్పదు. ప్రస్తుతం ఆర్టీఏ ఆఫీస్‌లో ప్రత్యేక స్ర్కీన్ ద్వారా డ్రైవింగ్ టెస్ట్ విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కువ శాతం ఫెయిల్ కావడంపై విశ్లేషించి, మరింతగా అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

- వీర్రాజు , జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి

అడ్డగోలు డెప్యుటేషన్

- వైసీపీ హయాంలో రెబేకాపై విమర్శలు
- ప్రభుత్వం మారినా.. మరోమారు ప్రాధాన్యం
- సీపీఓకు డెప్యుటేషన్ వేసిన డీఈఓ



డీఈఓ ఇచ్చిన డెప్యుటేషన్ ఆర్డర్



అనుమతి లేకుండా డెప్యుటేషన్లు వేయరాదంటూ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 25: విమర్శలు ఎదుర్కొన్న వారికి పెద్ద పీట వేస్తున్నారు. వైసీపీ హయాంలో చక్రం తిప్పినవారికి అడ్డగోలుగా డెప్యుటేషన్ వేశారు. ప్రభుత్వం మారినా జిల్లా విద్యాశాఖలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదని విమర్శలు వస్తున్నాయి. డీఈఓ కార్యాలయంలో జరుగుతున్న తంతుపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. పుట్లూరు మండలం కడవకల్లులో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ రెబేకాను చీఫ్ ప్లానింగ్ ఆఫీస్‌కు(సీపీఓ) డెప్యుటేషన్ వేశారు. తమ అనుమతి లేకుండా డెప్యుటేషన్లు వేయవద్దని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. అయినా డీఈఓ వరలక్ష్మి డెప్యుటేషన్ ఉత్తర్వులు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

చాలా పెద్ద కథే..

పుట్లూరు మండలం కడపవకల్లు జడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా రెబేకా పనిచేస్తున్నారు. ఆమె వైసీపీ హయాంలో అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టులో కొంతకాలం జీసీడీఓగా పనిచేశారు. ఆ సమయంలో పలు కేజీబీవీల్లో క్రైస్తవ మత ప్రార్థనలు జరిగాయి. పుట్లూరు కేజీబీవీలోకి ఓ పాస్టర్ వెళ్లి ప్రార్థనలు చేశారు. విద్యార్థినులకు నూనె రాసి.. ప్రార్థనలు చేయించారు. ఈ వ్యవహారం అప్పట్లో దుమారం రేపింది. కేజీబీవీ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. కొందరు బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అంతటితో ఆగకుండా.. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) వరకూ వెళ్లింది. దీంతో అప్పటి సమగ్రశిక్ష ఉన్నతాధికారులకు చెమటలు పట్టాయి. నాటి కలెక్టర్ కేంద్ర ప్రభుత్వం వద్ద వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ ఘటన తర్వాత ఉపాధ్యాయని రెబెకాను అప్పటి సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉన్నతాధికారికి సరెండర్ చేశారు. తర్వాత వచ్చిన ఏపీసీ సాయిరాం.. ఆమెను విద్యాశాఖకు రీ ప్యాట్రియేషన్ చేశారు.

మళ్లీ పట్టం..

ఉపాధ్యాయని రెబేకాను జిల్లా విద్యాశాఖాధికారి ఈ నెల 6న సీపీఓ కార్యాలయానికి డెప్యుటేషన్‌పై వేశారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన 'వికసిత్ ఆంధ్రా-2047'కు సంబంధించిన 2024-2025 నుంచి 2028-2029 వరకూ జిల్లా యాక్షన్ ప్లాన్ తయారు చేయడానికి ఆమెను డెప్యుటేషన్‌పై వేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు విమర్శలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వివాదాలకు కారణమైన ఆమెకు మరోమారు ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టించారని ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టర్, డీఈఓను విద్యాశాఖలో పనిచేసే ఓ టీచర్ తప్పుదోవ పట్టించారని ప్రచారం జరుగుతోంది. కొత్త ప్రభుత్వం వచ్చాక అనుమతి లేనిదే ఉపాధ్యాయులను డెప్యుటేషన్ వేయవద్దని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో డీఈఓ జారీ చేసిన ఉత్తర్వులు అమలౌతాయా..? రద్దవుతాయా..? అన్న చర్చ జరుగుతోంది.

పీఎంశ్రీ పాఠశాలలు ఆదర్శంగా ఉండాలి : కలెక్టర్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 25: జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవా లని కలెక్టరు వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పీఎంస్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ)పై ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఈపథకం కింద 42 పాఠశాలలను గుర్తించినట్లు వివరించారు. ఈపాఠశాలలన్నింటిలోను తాగు నీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, ఫర్నిచర్, సైన్స్, కంప్యూటర్, ఐసీటీల్యాబ్స్, ఇంటర్‌నెట్ సౌకర్యం, లైబ్రరీ, అటల్ టింకరింగ్ ల్యాబ్, స్కిల్‌ల్యాబ్, స్కూల్‌ఇన్నోవేషన్ కౌన్సిల్ ఇలా 21రకాల వసతులు తప్పకుండా ఉండేలా చూడాలన్నారు. ఈవిషయంలో విద్యాశాఖ అధికారులతో పాటు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అన్ని పీఎంశ్రీ స్కూళ్లలో ఉపాధిహామీ పథకం కింద ఆటస్థలాల్లో ఉన్న రాళ్లు, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. మైదానాన్ని పిల్లలు ఆడుకోవడానికి శుభ్రంగా తయారు చేయాలన్నారు. అన్ని చోట్ల పవర్ ప్యానల్స్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రతి విద్యార్థికి హెల్త్ చెకప్ చేయించాలని వైద్యశాఖ, విద్యా శాఖల అధికారులకు సూచించారు. పీఎంశ్రీ పాఠశాలలో వసతుల కల్పనకు అవసరమైతే సీఎస్ఆర్ నిధులు ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులకు చదువులతో పాటు ప్రతిరోజు ఆటలు ఆడించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, ఎస్ఎస్ఏ ఏపీసీ నాగరాజు, డ్వామాపీడీ విజయలక్ష్మి, డీసీఓ మురళీకృష్ణ, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అప్పుడే యాపారం మొదలు..!

అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు రూ.7లక్షలు..?

యాడికి, సెప్టెంబరు25: అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వచ్చిందో లేదో అప్పుడే రాజకీయ నాయకులు వ్యాపారానికి తెరలేపినట్లు మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. యాడికి మండలం పెద్దపేట అంగన్‌వాడీ కేంద్రంలో వర్కర్ పోస్టు ఖాళీగా ఉంది. దీని భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఈ పోస్టు ఓసీకి రిజర్వ్ చేశారు. ఈ పోస్టును దక్కించుకునేందుకు పైరవీలు ప్రారంభమయ్యాయి. పోస్టు కోసం రూ.5లక్షల నుంచి రూ.7లక్షల వరకు కొందరు నాయకులు డిమాండ్ చేస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. తమవారికే పోస్టు ఇవ్వాలంటూ అధికారపార్టీలోని పలువురు నాయకులు పట్టుబడుతున్నట్లు సమాచారం.

మోసపోవద్దు..

అంగన్‌వాడీ ఉద్యోగాల నియామకం పారదర్శకంగా జరుగుతుంది. ఉద్యోగం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పేవారిని నమ్మవద్దు. ఉద్యోగం కోసం ఎవరికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. అర్హత ఆధారంగానే నియామకాలు జరుగుతాయి. ప్రలోభ పెట్టే వారికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దు.

- విజయకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

డాక్టర్‌కు బిగుస్తున్న ఉచ్చు

- మూత్రనాళం తొలగింపు సంఘటన వాస్తవమే
- కమిషనర్, డీఎంఈ, కలెక్టరుకు డీఎంహెచ్ఓ నివేదిక
- దొరికిన ప్రభుత్వ వైద్యుడు రమణానాయక్



లావణ్య ఆస్పత్రిలో విచారణ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ.దేవి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 25: గర్భసంచి ఆపరేషన్‌కు వచ్చిన మహిళకు మూత్రనాళం తొలగించిన ప్రభుత్వ డాక్టర్ రమణానాయక్‌కు ఉచ్చు బిగుస్తోంది. తమకు జరిగిన అన్యాయంపై బాధిత మహిళ కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం రాత్రి ఆందోళన చేయడంతో పాటు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టరు ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ.దేవి మంగళవారం రాత్రి ఆస్పత్రికి వచ్చి బాధితులతో మాట్లాడారు. జరిగిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అతర్వాత డాక్టర్ రమణానాయక్‌ను పిలిపించి ఆపరేషన్ వ్యవహారంపై ప్రశ్నించి వివరాలు తీసుకున్నారు. క్లినిక్ నిర్వహణకు అనుమతి తీసుకుని ఆపరేషన్‌లు ఎలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూత్రనాళం తొలగింపు వాస్తవమని నిర్ధారణ కావడంతో నివేదికను వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డీఎంఈ, జిల్లా కలెక్టరుకు పంపినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.

విచారణకు కమిటీ

గర్భసంచి ఆపరేషన్‌కు వచ్చిన మహిళకు మూత్ర నాళాలు తొలగించిన ఘటనపై విచారణకు నలుగురు డాక్టర్లతో కమిటీని ఏర్పాటు చేశామని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉన్నతాధికారులు, డీఎంహెచ్ఓ సూచనల మేరకు జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న సీనియర్ అనస్థీషియా వైద్యుడు నవీన్‌కుమార్, సర్జన్ డాక్టర్ రామస్వామినాయక్, గైనకాలజిస్టు డాక్టర్ షంషాద్ బేగం, యూరాలజీ డాక్టర్ రంగస్వామిని నియమించామని తెలిపారు. ఘటనపై ఈ కమిటీ పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతుందని ఆయన అన్నారు.

హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

అనంతపురం క్రైం,సెప్టెంబరు 25: హత్యానేరం రుజువు కావడంతో ముద్దాయికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ అనంతపురం ఏడో అదనపు జిల్లా కోర్టు, ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి హరిత బుధవారం తీర్పు ఇచ్చారు. అనంతపురం శివారులోని రుద్రంపేటకు చెందిన మొలక దేవేంద్ర(హతుడు)అతడి భార్య లక్ష్మిదేవి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వార్డుబాయ్, ఆయాగా పని చేసేవారు. వారి ఇంటి పక్కనే లక్ష్మీనారాయణ కుటుంబం ఉండేది. గతంలో దేవేంద్ర లక్ష్మీనారాయణ భార్యను దుర్భాషలాడాడు. అది మనసులో పెట్టుకుని 2021 నవంబరు 11న ఉదయం 9.30 గంటలకు దేవేంద్ర, లక్ష్మిదేవిలు ఇంట్లో ఉండగా లక్ష్మీనారాయణ వెళ్లి గొడవ పడ్డాడు. కింద పడిన దేవేంద్ర తలపై పునాదిరాయి తీసుకుని వేశాడు. దీంతో దేవేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి ఫోర్త్‌టౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు చార్జిషీట్‌దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో లక్ష్మీనారాయణకు శిక్ష విధించారు.

రైతు కుటుంబానికి జేసీ పరామర్శ

రూ.లక్ష చెక్కు అందజేత



పామిడిలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

పామిడి, సెప్టెంబరు 25: రెవెన్యూ అధికారుల అవినీతికి బలైన రైతు కుమ్మర సూర్యనారాయణ(54) కుటుంబాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ బుధవారం పరామర్శించారు. పట్టణంలోని బొడ్రాయి వద్ద గల బాధితుల ఇంటికి వెళ్లి సంఘటనపై ఆరా తీశారు. గార్లదిన్నె మండలం బూదేడు రెవెన్యూ గ్రామంలోని సర్వేనెంబర్ 135-1లో 1.54సెంట్లు భూమి ఉందని, ఆ భూమికి పాసుపుస్తకం కోసం కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోవడంతో జీవితంపై విరక్తి చెంది సూర్యనారాయణ ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య కుమ్మర ఈశ్వరమ్మ జేసీ ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. ఉండటానికి ఇళ్లు కూడా లేదు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమేనని గోడు వెళ్లబోసుకుంది. మీరే ఎలాగైనా ఆదుకోవా లని ప్రాధేయపడింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏమేమి వస్తాయో అన్ని బెనిఫిట్స్ ఇప్పిస్తానని జేసీ ఆమెకు హామీ ఇచ్చారు. భూమి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అమ్మను బాగా చూసుకోవాలని ఇద్దరు కుమారులకు జాయింట్ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ వసంతకుమార్, పామిడి, గార్లదిన్నె తహసీల్దార్లు శ్రీధర్‌మూర్తి, ఈరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రూ. 1లక్ష చెక్కును అందజేశారు.

సమస్యల స్టేషన్

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పని చేయని ఎస్కలేటర్లు

ప్లాట్‌ఫాంల వద్ద కంపుకొడుతున్న మురుగు వాసన

అపరిశుభ్రంగా పాత వెయిటింగ్ హాళ్లు


మురుగు నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతున్న డ్రెయిన్

గుంతకల్లు, సెప్టెంబరు 25: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణిలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పుడూ అత్యంత రద్దీగా ఉండే ప్లాట్‌ఫాంలో సైతం అధికారులు ఎస్కలేటరును ఆఫ్‌లో ఉంచి ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో ప్లాట్‌ఫాంల వద్ద దుర్వాసన వెదజల్లుతోంది. పాత వెయిటింగ్ హాళ్లలో పరిశుభ్రత లోపించిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైలు వచ్చే ఐదు నిమిషాల ముందు మాత్రమే రైలు ఏ ప్లాట్‌ఫాం పైకి వస్తుందో తెలియజేస్తున్నారు. దీంతో లిఫ్టులు, ఎస్కలేటర్లు పని చేయని కారణంగా ప్రయాణికులు పడుతూ లేస్తూ రైలు వచ్చే ప్లాట్‌ఫాం వద్దకు చేరుకుంటున్నారు.

ఎస్కలేటర్లను ఆన్‌లో ఉంచాలి

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో 1, 2-3, 4-5, 6-7 ప్లాట్‌ఫాంలకు నాలుగు ఎస్కలేటర్లను అమర్చారు. కానీ 1 నెం. ప్లాట్‌ఫారంలో మాత్రమే ఎస్కలేటరును ఆన్‌లో ఉంచుతున్నారు. 2-3, 4-5 ప్లాట్‌ఫాంలలో ఎస్కలేటరును ఆఫ్‌లో ఉంచుతున్నారు. 6-7 ప్లాట్‌ఫాంల ఎస్కలేటర్‌ను సాయంత్రం ప్రయాణికుల రద్దీ ఉన్నప్పుడు మాత్రమే ఆన్‌చేస్తున్నారు. పగలు రైళ్లు ఉన్నా 1వ నెం. ప్లాట్‌ఫాంలో మినహా ఇతర ఎస్కలేటర్లు పని చేయడం లేదు. ఇక రాత్రి 10 గంటలు దాటిందంటే చాలు ఎస్కలేటర్లన్నీ ఆఫైపోతాయి. గుంతకల్లు రైల్వే జంక్షన్‌కు పగలు కంటే రాత్రి సమయాల్లోనే ఎక్కువ సంఖ్యలో రైళ్లు వస్తుంటాయి. ఆ సమయాల్లో ఎస్కలేటరు పనిచేయని కారణంగా ప్రయాణికులు లగేజీ, పిల్లలతో పడుతూ లేస్తూ మెట్ల మార్గంలోనే వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణికులు లేనప్పుడు తిరగకుండా.. జనం వచ్చిన వెంటనే రన్ అయ్యేలా ఎస్కలేటర్లకు సెన్సర్లు ఉంటాయి. కానీ విద్యుత్ ఆదా పేరిట ఎలక్ట్రికల్ అధికారులు ఎస్కలేటర్లను లాక్‌చేసి వెళ్లిపోతున్నారు. రాత్రి సమయాల్లో పూర్తిగా ఎస్కలేటరును ఆన్‌లో ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా వెయిటింగ్ హాళ్లు

రైల్వే స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన ప్రవేశ భవనంలో ఉన్న వెయిటింగ్ హాళ్ల నిర్వహణ బాగానే ఉన్నా, 7వ నెం. ప్లాట్‌ఫాంలో ఉన్న పాత వెయిటింగ్ హాళ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్లాట్‌ఫాంల వద్ద పారిశుధ్య నిర్వహణ బాగానే ఉన్నా, మురుగు కాల్వలను సరిగా శుభ్రం చేయని కారణంగా అక్కడంతా దుర్వాసన వెదజల్లుతోంది. ప్లాట్‌ఫారాలపై ఆహారం తీసుకునే సమయంలో ఇబ్బందికరంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే స్టేషన్‌లో డ్రెయిన్ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటం వల్ల భారీ వర్షాలు వచ్చినప్పుడు పలుమార్లు మురుగు కాల్వల నుంచి నీరు పారక ప్లాట్‌ఫాంలకు ఆనుకుని ఉన్న ట్రాక్‌లు మునిగిపోతున్నాయి. కొత్తగా నిర్మించిన 1వ నెంబరు ప్లాట్‌ఫాంపై వేసిన రేకులు వర్షానికి కారుతున్నందున ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వీలైనంత త్వరగా అధికారులు ఈ సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లు ఉంటారో..?

రిటైర్ కాకుండా కొనసాగుతున్న అంగన్‌వాడీలు

తప్పుడు జనన పత్రాల సమర్పణ

నిద్రమత్తు వీడని అధికారులు


ఐసీడీఎస్‌శాఖ కార్యాలయం

తాడిపత్రి, సెప్టెంబరు 25: తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు రిటైర్‌మెంట్ వయస్సు దాటినప్పటికి ఇంకా విధుల్లో కొనసాగుతున్నారు. వీరిని చూస్తున్న పలువురు ఇంకెన్నాళ్లు విధుల్లో ఉంటారో అంటూ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో దాదాపు 300 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పనిచేస్తున్నారు. వీరిలో కొందరు రిటైర్‌మెంట్ వయసు దాటిపోయినా కొనసాగుతున్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. 1990వ దశకంలో 7, 8వ తరగతి చదివిన వారిని కూడా అంగన్‌వాడీ వర్కర్లుగా చేర్చుకున్నారు. అప్పట్లో వారు సమర్పించిన వయసు ధ్రువీకరణ పత్రాలను బట్టిచూస్తే ప్రస్తుతం వారు రిటైర్‌మెంట్ పొందాల్సి ఉంటుంది. కానీ తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించి ఇంకా విధుల్లో కొనసాగుతున్నారని తెలుస్తోంది.

మత్తువీడని అధికారులు

తప్పుడు ధ్రువీకరణపత్రాలు సమర్పించి విధుల్లో కొనసాగుతున్న పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన ఆ శాఖ అధికారులు నిద్రమత్తు వీడడం లేదు. కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు వారు విధుల్లో చేరే సమయంలో ఇచ్చిన వయసు ధ్రువీకరణ పత్రాలతోపాటు ఈ మధ్య కాలంలో వచ్చిన ఓపెన్ టెన్త్ సర్టిఫికెట్‌లో వయసును దాదాపు 10 నుంచి 15 సంవత్సరాలపాటు తగ్గించుకొని.. ఆ సర్టిఫికెట్‌ను ఐసీడీఎస్‌కు సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సర్టిఫికెట్లలో ఉన్న పుట్టిన తేదీలను ప్రామాణికంగా తీసుకోవడంతో వారు ఇంకా విధుల్లో ఉంటున్నారన్న ప్రచారం సాగుతోంది. దీనిపై పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నెలరోజుల క్రితం తాడిపత్రి పర్యటనకు వచ్చిన కలెక్టర్ వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు 2015కు ముందు ఉద్యోగాలు పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు. కొందరు కార్యకర్తలు సెలవుపై వెళ్లగా, మరికొందరు సర్టిఫికెట్లు కాలిపోయాయని చెప్పడం గమనార్హం. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను అడ్డుకొనేందుకు విశ్వప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తోంది. కొందరు యూనియన్ నాయకులను అడ్డు పెట్టుకొని బెదిరింపులకు సైతం దిగారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిష్పక్షపాతంగా విచారణ జరగాలి

అక్రమాలకు పాల్పడిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సంబంధించి నిష్పక్షపాతంగా విచారణ సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విచారణ వేగవంతం చేసి అక్రమార్కులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. విచారణకు అడ్డుతగులుతున్న పలువురు యూనియన్ నాయకులను పట్టించుకోకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనిపై ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగంను వివరణ కోరగా.. తప్పుడు వయసు ధ్రువీకరణపత్రాలను ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రస్తుతం విచారణ జరుపుతున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

ధర్మవరం ఘటనలో ఇరు వర్గాలపై కేసు

చట్టం దృష్టిలో అందరూ సమానమే: ఎస్పీ రత్న



పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 25 : ధర్మవరం పట్టణంలో రెండురోజుల క్రితం ఇరు పార్టీల మధ్య చోటుచేసుకున్న సంఘటనలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఇరు పార్టీల వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఎవరినీ ఉపేక్షించే పరిస్థితిలేదన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమే అన్నారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలను మోహరించామని తెలిపారు. ప్రజాప్రతినిధులు సంయమనంతో వ్యవహరించాలని ఎస్పీ కోరారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 25: జిల్లా పరిధిలో పనిచేస్తున్న పలువురు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రావును అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. నంద్యాల సెబ్‌లో పనిచేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డిని అనంతపురానికి బదిలీ చేశారు. అనంతపురం ఎక్సైజ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ బాలకృష్ణను తిరుపతి డిస్టిలరీకి బదిలీ చేశారు. విజయవాడ డిస్టిలరీలో పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామిని జిల్లాకు బదిలీ చేశారు. గతంలో రాయలసీమ జిల్లాలకు కర్నూలు కేంద్రంగా డిప్యూటీ కమిషనర్ పని చేసేవారు. కానీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జిల్లాకు డిప్యూటీ కమిషనర్ పోస్టును కేటాయించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న నాగమద్దయ్యను నియమించారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో రొళ్ల వాసి


డాక్టర్ కె.మంజునాథ్

రొళ్ల, సెప్టెంబరు 25 : అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన ప్రపంచంలోనే ప్రముఖ శాస్త్రవేత్తల జాబితాలో రొళ్ల మండలం అగ్రహారం గ్రామానికి చెందిన డాక్టర్ కె.మంజునాథ్ చోటు దక్కించుకొన్నారు. మంజునాథ్ పదో తరగతి వరకు రొళ్ల మురళీ పాఠశాల, ఇంటర్ అనంతపురం నారాయణ కళాశాలలో చదివారు. బీఎస్సీ తుమకూరు సిద్ధగంగా కళాశాల, ఎమ్మెస్సీ శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. బెంగళూరులోని జైన్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. తరువాత బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్‌ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ సంస్థలో ప్రఖ్యాత శాస్త్రవేత్త, భారతరత్న ప్రొఫెసర్ సీఎన్‌ఆర్ రావుతో కలిసి సీనియర్ పోస్ట్ డాక్టోరల్ విద్యార్థిగా ఎన్నో పరిశోధనలు చేశారు. ప్రస్తుతం బెంగళూరులోని నిట్టే మీనాక్షి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సీనియర్ గ్రేడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

పొద్దుతిరుగుడు కనుమరుగు..!

- తగ్గిన సాగు విస్తీర్ణం
- తెగుళ్లు, ధరల పతనమే కారణమా?



ధర్మవరం, సెప్టెంబరు 25: జిల్లాలో కొన్నేళ్ల క్రితం ఎటు చూసినా పొద్దుతిరుగుడు పంట కనిపించేది. గ్రామాల్లో రైతులు ఎక్కువగా ఈ పంట సాగుపైనే దృష్టి సారించేవారు. సాగు ఖర్చు తక్కువ కావడం, దిగుబడి, లాభం అధికంగా ఉండడమే ఇందుకు కారణం. రాను రాను విత్తన నాణ్యత తగ్గడంతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు ఈ పంట సాగును వదిలేశారు. దీంతో వేలాది ఎకరాల్లో సాగయ్యే పొద్దుతిరుగు పంట నేడు కనీసం వందల ఎకరాల్లో కూడా కనిపించడంలేదు. గతంలో జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల ఎకరాల్లో పొద్దుతిరుగు పంటను రైతులు సాగుచేసేవారు. కదిరి, రొద్దం, పెనుకొండ, తనకల్లు, తలుపుల, తాడిమర్రి, ముదిగుబ్బ, నల్లమాడ, ఎన్‌పీకుంట, ప్రాంతాల్లో అధికంగా సాగుచేసేవారు. గడిచిన ఐదేళ్ల నుంచి ఈ ప్రాంతాల్లో కూడా పొద్దుతిరుగుడు పంట కనిపించకుండా పోయింది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా పొద్దుతిరుగుడు పంటను సాగుచేశారు.

సాగు పడిపోవడానికి కారణాలు ఇవే..

పొద్దుతిరుగు పంటకు ప్రధానంగా నల్లతెగుళ్లు, భూమిలో భాస్వరం, పోటాషియం వాడకం పోవడం, ఇతర వైరస్ సోకడంతో పూత రాలిపోతుంది. దీంతో ఆకులు ఎండిపోతూ మొక్కచనిపోతుంది. అదే సమయంలో రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కూడా లభించడంలేదు. క్వింటాలు పొద్దుతిరుగుడుకు రూ.6వేలకు పైగా మద్దతు ధర లభిస్తేకానీ గిట్టుబాటుకాదు. మార్కెట్‌లో గతంలో క్వింటాలు ధర రూ.5500 ఉండేది. ప్రస్తుతం రూ.2వేల నుంచి రూ.3500 వరకు ధర ఉందని రైతులు అంటున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ప్రముఖ కంపెనీల పేరుతో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనం ప్యాకెట్లు విక్రయించేవారు. దాని వల్ల పంట దిగుబడి సరిగా వచ్చేది కాదు. ఇలా అనేక కారణాలతో రైతులు ఈ పంటను సాగుచేసేందుకు ఏ మాత్రం ముందుకు రావడంలేదు. గతంలో పొద్దుతిరుగుడు ఆయిల్ కొనుగోలు అధికంగా ఉండేది. ప్రస్తుతం పామాయిల్ వాడకం అధికంగా ఉండటం వల్ల కూడా పొద్దుతిరుగుడు విత్తనాలకు డిమాండ్ పడిపోయినట్లు తెలుస్తోంది.

పెట్టుబడులు కూడా రాలేదు..



గతంలో ఐదెకరాల పొలంలో రూ.90వేల వరకు వెచ్చించి పొద్దుతిరుగుడు పంట సాగుచేసేవాళ్లం. పూత దశలో ఎండు తెగుళ్లు సోకుతుండటం వల్ల పంట దిగుబడి తగ్గిపోయి నష్టం వచ్చేది. పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో పొద్దుతిరుగుడు సాగు చేయడం మానేశా. ప్రస్తుతం వరి పంటసాగు చేస్తున్నా.

- కెంపుల బాబు, కొత్తచెరువు

గిట్టుబాటు ధరలేదు..



గతంలో నాలుగు ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట సాగుచేశా. మాతో పాటు పక్క రైతులు సాగుచేసేవారు. దాని వల్ల గింజపడేటప్పుడు పక్షుల బెడద తగ్గేది. అప్పట్లో పొద్దుతిరుగుడుకు తెగుళ్లు వచ్చేవి కావు. ఇప్పుడు తెగుళ్లు అధికమై మందులకు అధికంగా ఖర్చుపెట్టాల్సి వస్తోంది. నాలుగు ఎకరాలకు రూ.80వేలు ఖర్చు చేసి పంట సాగు చేస్తే ఇంటి మనుషులకు కూలి తగ్గట్టు కూడా మిగలడంలేదు.

- కృష్ణారెడ్డి, తాడిమర్రి

తెగుళ్లతోనే తగ్గిన సాగు

పొద్దుతిరుగుడుకు తెగుళ్లు సోకుతుండం, పూత దశలో బ్లైట్స్ అనే తెగులు సోకడం వల్ల పంట దిగుబడి తగ్గుతోంది. ముఖ్యంగా అతివృష్టి, అనావృష్టి వల్ల కూడా పొద్దుతిరుగుడు సాగుపై తీవ్ర ప్రభావం పడుతోంది. సత్యసాయి జిల్లాలో కూడా శాస్త్రవేత్తలు భూములను పరిశీలించి ఈ ప్రాంతంలో పొద్దుతిరుగుడు సాగుకు అనుకూలమైన వాతావరణం లేదని గతంలోనే తెలిపారు.

- సుబ్బారావు, ఏడీ, వ్యవసాయశాఖ

విద్యార్థులకు జేఎన్‌టీయూ వరం

- కొనియాడిన కియ ప్రతినిధులు
- వర్సిటీతో ఎంఓయూకు అంగీకారం
- హర్షం వ్యక్తం చేసిన ఇన్‌చార్జి వీసీ


కియ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 25: టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు మౌలిక సదుపాయాలు కల్పించిన జేఎన్‌టీయూ ఈ ప్రాంత విద్యార్థులకు వరమని కియ ప్రతినిధులు ప్రశంసించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆధ్వర్యంలో కియ ప్రతినిధులు హాంగ్‌సంగ్ పార్క్, హంగు కిమ్, శ్రీహాసన్ వర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాలను బుధవారం సందర్శించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ల్యాబ్‌లు, సీమెన్స్ ల్యాబ్, స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాన్ని వారు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వీసీ సుదర్శన రావు మాట్లాడుతూ, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు కియ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం ఉందని అన్నారు. కియను ఫ్యాకల్టీ సందర్శించి, అక్కడి పనులపై పరిశోధనలు చేయవచ్చునని తెలిపారు. రియల్ టైమ్ సమస్యలను పరిష్కరించడానికి, ప్రాజెక్టులు చేయడానికి కియలో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవడానికి కియతో ఒప్పంద కుదుర్చుకునేందుకు ఆహ్వానం పలికామని అన్నారు. కియ ప్రతినిధులు వర్సిటీని సందర్శించి, ఎంఓయూకు ఒప్పుకోవడం శుభపరిణామమని అన్నారు. కియ, జేఎన్‌టీయూ పరస్పర సహకారంతో అనేక ప్రయోజనాలు పొందవచ్చునని అన్నారు. ఆ దిశగా గతంలో ప్రయత్నాలు జరగలేదని, దీంతో ఆ సంస్థ ప్రతినిధులు వర్సిటీకి రాలేదని అన్నారు. తొలి సందర్శనలోనే జేఎన్‌టీయూ సేవలను వినియోగించుకునేందుకు కియ ప్రతినిధులు సముఖత వ్యక్తం చేశారని అన్నారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ విశాలి, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కియ ప్రతినిధులు ఉపాశంకర్ పట్నాయక్, రమేష్‌బాబు, విజయ పాయ్, డీఏపీ కో ఆర్డినేటర్ అరుణ మస్తాని, హెచ్‌ఓడీలు కళ్యాణిరాధ, రామశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్


కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న డీఎస్ విజయకుమార్

గుంతకల్లు, సెప్టెంబరు 25: స్థానిక రైల్వే డీజిల్ షెడ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ కోరారు. బుధవారం ఉదయం మజ్దూర్ యూనియన్ నాయకులు డీజిల్ షెడ్‌ను సందర్శించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. టూల్స్, స్పేర్స్ కొరత, ఉద్యోగులకు మౌలిక వసతుల లేమి తదితర అంశాలపై కార్మికులు సమస్యలను వివరించారు. అనంతరం యూనియన్ నాయకులు షెడ్ సీనియర్ డీఎంఈని కలిసి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విన్నవించారు.

దరఖాస్తుకు గడువు పొడిగింపు

అనంతపురం విద్య/కొత్తచెరువు, సెప్టెంబరు 25: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వతరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు అనంత, శ్రీసత్యసాయి జిల్లాల డీఈఓలు వేర్వేరు ప్రకటనల్లో బుధవారం వెల్లడించారు. గడువును అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆరో తరగతిలో చేరే విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ విద్యా ఏడాది ఐదో తరగతి చదువుతూ...ఆయా జిల్లాల్లో నివాసం ఉండి, 2013 మే 1 నుంచి 2015 జులై 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగ, బాలికలకు ప్రవేశాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు..

అనంతపురం విద్య: ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించినట్లు డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 13వ వరకూ గడువు పొడిగించారని తెలిపారు. 14న ప్రింటెండ్ నామినల్ రోల్స్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు కమలానగర్‌లోని పాత డీఈఓ ఆఫీస్‌లోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు. కాగా పరీక్షలు డిసెంబరు 8న జరుగుతాయన్నారు.

29న హిందీ మోడల్ టెట్

అనంతపురం విద్య, సెప్టెంబరు 25: హిందీ సేవాసదన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకూ రాష్ట్ర స్థాయి ఏపీ టెట్ హిందీ ఆన్‌లైన్ మోడల్ టెస్టు నిర్వహించనున్నట్లు హిందీ సేవాసదన్ వ్యవస్థాపకులు గైబువల్లి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 5న ప్రభుత్వం నిర్వహించే టెట్ హిందీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ మోడల్ టెస్ట్ నిర్వహించనట్లు తెలిపారు. వివరాలకు 958 1386150, 9553677119, 9848783787 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

స్టాపింగ్ రద్దు

గుంతకల్లు, సెప్టెంబరు 25: బెంగళూరు కంటోన్మెంటు ప్లాట్‌ఫారాల పనుల కారణంగా మైసూరు-జైపూర్ ఎక్స్‌ప్రెస్ (నెం.12975) రైలుకు డిసెంబరు 19వ తేదీ వరకు ఈ స్టేషన్ స్టాపింగ్‌ను తొలగించినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను డిసెంబరు 20వ తేదీ వరకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో నిలపడం జరగదన్నారు. కోయంబత్తూరు-ముంబై రైలు (నెం.11014)ను, ముంబై-కోయంబత్తూరు-ముంబై (నెం. 11013/14) రైళ్లను, బెంగళూరు-న్యూఢిల్లీ (నెం. 12627), బెంగళూరు-ముంబై నెఎం. 11302) రైలును, బెంగళూరు-నాందేడ్ (నెం. 16593) రైలును డిసెంబరు 20వ తేదీ వరకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో నిలపడం ఉండదన్నారు. నాందేడ్-బెంగళూరు (నెం. 16220), ముంబై-బెంగళూరు (నెం. 11301), కాచిగూడ-మైసూరు (నెం. 12785), భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి (నెం. 18463) రైలుకు, న్యూఢిల్లీ-బెంగళూరు (నెం. 12628) రైలుకు, జైపూర్-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 12976)కు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో స్టాపింగ్‌ను రద్దుచేసినట్లు తెలియజేశారు.

రథానికి నిప్పు పెట్టింది వైసీపీ నాయకుడే

అరెస్టు చేసిన పోలీసులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 25: కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామంలో రాములోరి రథానికి నిప్పంటించిన ఘటనలో వైసీపీ నాయకుడు బోడిమల్ల ఈశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను ఎస్పీ జగదీష్ బుధవారం విలేకరులకు తెలిపారు. రాములోరి రథాన్ని 2022లో అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామిరెడ్డి సోదరులు రూ.20లక్షలు వెచ్చించి తయారు చేయించారని అన్నారు. రథం తయారీకి వారు గ్రామంలో ఎవరి సహాయసహకారాలు, చందాలు తీసుకోలేదని, దీంతో గ్రామస్థుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 23న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రథాన్ని భద్రపరిచిన మండపం తాళాలు పగులగొట్టి అందులో ప్రవేశించారని, అనంతరం రథానికి నిప్పు పెట్టారని తెలిపారు. మంటలు ఎగిసి పడటాన్ని మండపం సమీపంలోని ఇళ్ల వారు గమనించి అక్కడికి వచ్చి ఆర్పివేశారని తెలిపారు. రథం తయారీలో తమ సహకారం తీసుకోలేదనే అక్కసుతోనే గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి ఈ ఘటనకు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఐదారుగురిని విచారించామని, ఈశ్వర్‌రెడ్డిని రిమాండ్‌కు పంపుతామని తెలిపారు.


అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

రథం దహనం వెనుక హెచ్‌సీ

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం, సెప్టెంబరు 25: రాముల వారి రథం దహనం వెనుక పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రఘునాథరెడ్డి పాత్ర ఉందని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తన నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రథం దహనం కేసులో వైసీపీ నాయకుడు బోడిమల్ల ఈశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం హర్షణీయమని అన్నారు. ఈ ఘటనపై గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒకే వ్యక్తి రథం తలుపులు బద్దలు కొట్టి నిప్పంటించడం సాధ్యంకాదని అన్నారు. నిందితుడికి నలుగురైదుగురు సహకరించి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. హెడ్ కానిస్టేబుల్ రఘునాథరెడ్డి పాత్ర ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారని అన్నారు. కణేకల్లు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించినంత కాలం ఆయన వైసీపీకి తొత్తుగా వ్యవహరించారని ఆరోపించారు. టీడీపీ నాయకులపై అనేక అక్రమ కేసులు బనాయించారని అన్నారు. హనకనహాళ్ గ్రామానికి సంబంధం లేని వ్యక్తి అనంతపురం నుంచి ఎందుకు వచ్చాడని ప్రశ్నించారు. ప్రధాన నిందితుడు ఈశ్వర్‌రెడ్డి రఘునాథరెడ్డికి సమీప బంధువని అన్నారు. బంధువుల్ని కాపాడటానికి వచ్చాడా..? ఒక్కరే నేరం చేసినట్లు నమ్మించే పథకాన్ని రచించడానికి వచ్చాడా అని అనుమానం వ్యక్తం చేశారు. హెడ్ కానిస్టేబుల్ రఘునాథ్‌రెడ్డి కాల్ డేటాను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించాలని కోరారు.

సన్న, చిన్నకారు రైతులకు చేయూతనివ్వండి

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, సెప్టెంబరు 25: చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాయి ఆరామంలో వ్యవసాయ అనుబంధ రంగాల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలాల్లో భద్రత, పశువుల ఉత్పత్తి పద్ధతులను మెరుగుపరచడానికి రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జిల్లాలోని తనకల్లు, రొళ్ల మండలాల్లోని 32 గ్రామాల్లో పౌల్ట్రీపై ట్రాన్స్‌ఫార్మ్ ప్రాజెక్టు పనిచేస్తుందని తద్వారా మంచి ఫలితాలొస్తాయని, వీటిని ఇతరులకు తెలియాల్సి ఉంటుందన్నారు. సన్నకారు రైతుల జీవనోపాధిని పెంచడానికి పెరటికోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. డీఆర్‌డీఏ, సెర్ప్ భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రవికాంత్, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధకశాఖ అధికారి కృష్ణచైతన్య, మత్స్య శాఖాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 25: ఉమ్మడి జిల్లా పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేశారు. పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యంను వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న నాగమణిని సీసీఎస్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న షేక్ జాకీర్‌ను సైబర్ క్రైంకు బదిలీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న గోపీనాథ్ రెడ్డిని పుట్టపర్తి మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

పొల్యూషన్ కంట్రోల్ ఈఈ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25: ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ మునిప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పెద్దిరెడ్డి కిశోర్‌కుమార్ రెడ్డిని కర్నూలుకు బదిలీ చేయగా, కర్నూలులో ఈఈగా పనిచేస్తున్న మునిప్రసాద్‌ను ఆ స్థానానికి బదిలీ చేశారు. దీంతో మునిప్రసాద్ బుధవారం అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మధ్యాహ్నం స్థానిక రామ్‌నగర్‌లోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యులు ఆదెన్న, శ్రీనివాసచౌదరి, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

చెన్నకేశవాలయ భూములను పరిరక్షించాలి

● కలెక్టర్‌ను కోరిన బీజేపీ, హిందూ చైతన్య వేదిక

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 25 : నగరంలో పాతూరులోని చెన్నకేశవ స్వామి దేవాలయ భూములను పరిరక్షించాలని బీజేపీ నాయకులు, హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. వారు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి, హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు విశ్వేశరరెడ్డి మాట్లాడుతూ చెన్నకేశవాలయ మాన్యం భూములు వందల ఎకరాల్లో ఉన్నాయన్నారు. వాటిని కబ్జాకోరుల నుంచి విడిపించి ఆలయానికి చెందించాలని డిమాండ్‌చేశారు. నాయకులు వీరాంజినేయులు, విశ్వనాథ్‌రెడ్డి, కిషోర్, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శప్రాయుడు దీనదయాళ్'



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 25: జనసంఘం ద్వితీయ జాతీయ అధ్యక్షుడు దీన్ దయాళ్ నేటి సమాజానికి ఆదర్శ ప్రాయుడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం దీన్ దయాళ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సందిరెడ్డి శ్రీనివాసులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు కిరణ్ గౌడ్, నాయకులు అశోక్‌రెడ్డి, ప్రసాద్, మల్లిక, వెంకటేష్, నాగరాజు, రాజేష్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 25 : ఎస్సీ ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనీల్ కుమార్, జిల్లా అధ్యక్షుడిగా రామాంజనేయులు ఎన్నికయ్యారు. సమితి జిల్లా కార్యాలయంలో బుధవారం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మునగాల సునీల్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జల వెంకటేష్ సంయుక్త అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మునగాల అనీల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడిగా హరిజన రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారికి రాష్ట్ర నాయకుల చేతులమీదుగా నియామక పత్రాలు అందజే శారు.

వరద బాధితులకు సాయం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 25 : విజయవాడ వరద బాధితులకు రాజహంస బిల్డర్స్ యజమానులు శ్రీనివాస్, శేఖర్, సాగర్ రూ.3 లక్షలు అందించారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు రూ.3 లక్షల చెక్కును రాజహంస బిల్డర్స్ ప్రతినిధులు అందజేశారు. టీడీపీ నాయకులు సుధాకర్ నాయుడు, గంగారామ్, చంటి, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యంలో నిర్లక్ష్యంపై పరిహారానికి ఆదేశం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 25: వైద్యంలో జరిగిన నిర్లక్ష్యానికి బాధిత కుటుంబానికి రూ.10లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగ దారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం శ్రీలత తీర్పు తెప్పారు. నగరానికి చెందిన అనిల్‌కుమార్(38)కు వాంతులు కావడం తో 2018 నవంబరు 20 స్థానిక వైద్యుల సూచనల మేరకు బెంగ ళూరు సీఎంఐ ఆసుపత్రిలో చేర్చారు. రెండు రోజుల పరీక్షల అనంత రం వైద్యులు అతడికి మూత్రపిండాల సమస్య ఉందని, రోగి అంగీకా రంతో ఆపరేషన్ చేసి, స్టంట్ వేశారు. వైద్యుల సూచన మేరకు నాలుగు వారాల తరువాత డిసెంబరు 12న ఆస్పత్రికి వెళ్లగా.. 28న ఆపరేషన్ చేశారు. మూత్రపిండంలో స్టంట్లు తొలగించామన్నారు. అయితే 2019 జూలై మొదటివారంలో కుడికాలులో నొప్పి రావడం తో అదే ఆసుపత్రికెళ్లారు. కోవిడ్ చికిత్సల నేపథ్యంలో వారు మరో ఆసుపత్రిలో చేర్చారు. రోగి పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ఎమ్మారై నిర్వహించి మూత్రపిండంలో పొరపాటున ఒక స్టంట్ ఉందని దాన్ని 2020 నవంబరు 6న తొలగించారు. అయితే 2020 డిసెంబరు 21న వాంతులతో రోగి మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ మృతుడి భార్య, పిల్లలు, తండ్రి జిల్లా వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదన లు విని రూ.10లక్షలు చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆదేశి స్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత తీర్పు వెల్లడించారు.

దాడి కేసులో ఆర్నెల్ల జైలు

అనంతపురం క్రైం: నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దాడి కేసులో ఓ వ్యక్తికి ఆర్నెల్ల జైలు శిక్ష లేక రూ.11వేల జరిమానా విధిస్తూ అనంతపురం మొబైల్ మెజిస్ట్రేట్ సృజన్‌కుమార్ తీర్పు వెల్లడించారు. నాలుగేళ్ల క్రితం కూడేరు మండలం నాగిరెడ్డి పల్లికి చెందిన మీనుగ సంగప్ప, అతడి తమ్ముడు సుబ్బరాయుడుకు అనంతపురంలో ఉన్న ఆస్తి విషయంపై తగాదాలున్నాయి. సుబ్బరాయుడు, అతడ చెల్లెలు దీనమ్మను ముద్దాయిలు మీనుగ సంగప్ప, అతని కొడుకు కిషోర్‌కుమార్, కుమార్తె సంధ్య రాణి కలిసి దాడి చేసి గాయపరిచారు. ఈ కేసులో వారికి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఎస్పీని కలిసిన అమరావతి జేఏసీ నాయకులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 25: ఎస్పీ జగదీష్‌ను బుధవారం అమరావతి జేఏసీ జిల్లానాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో అక్కడక్కడ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి వివరించారు. జేఏసీజిల్లా చైర్మన్ దివాకరరావు, నాయకులు మల్లరాయుడు, పెద్దయ్య, తోటచెన్నప్ప తదితరులు ఉన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ

కనగానపల్లి, సెప్టెంబరు 25: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కలు మంజూరైన రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన మామిడి మొక్కలను బుధవారం రైతులకు పంపిణీ చేశారు. ఈఓఆర్‌డీ అనిల్‌కుమార్, ఏపీఓ వెంకటేశ్‌నాయక్, ఎంపీటీసీ బిల్లేభాస్కర్, సర్పంచ్ అంకే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

రామగిరి, సెప్టెంబరు 25: మండలంలోని ముత్యాలంపల్లి కి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, నసనకోట పంచాయతీ మాజీ సర్పంచ్ నారాయణప్ప(75)అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత టీడీపీ నాయకులతో కలిసి ముత్యాలంపల్లిలోని నారాయ ణప్ప నివాసానికి వెళ్లి భౌతికకాయంపై టీడీపీ జెండా ఉంచి పూ లమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, మాదాపురం శంకర్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతపురంరూరల్: మండల పరిధిలోని కొప్పలకొండ గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల ను పట్టుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. కొప్పలకొండ నుంచి బుధవారం మూడు ట్రాక్టర్లతో కొంత మంది అక్రమంగా ఇసుకతరలిస్తుండటంతో వాటిని పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులు

ఐదేళ్ల అవినీతిని బయటకు తీస్తాం

● మాజీ ఎమ్మెల్యే, మేయర్ తప్పించుకోలేరు: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 25 : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అవినీతి లెక్కలు బయటకు తీస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎర్రనేల కొట్టాల, మారుతీనగర్‌లో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలకు ఏకష్టం లేకుండా చేయడమే లక్ష్యమన్నారు. గత ఐదేళ్లలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం తప్పించుకోలేరన్నారు. డంపింగ్ యార్డు అవినీతిపై జేసీతో విచారణకు ఆదేశించామని, పనిముట్ల వ్యవహారం ఫిర్యాదులపై విచారణ చేయిస్తామన్నారు. కూటమి ప్రభు త్వం మైనార్టీల పక్షపాతి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నాగరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గాజుల ఆదెన్న, గోళ్ల సుధాకర్ నాయుడు, పోతుల లక్ష్మీనరసింహులు, రాజారావు, పీఎం లక్ష్మీప్రసాద్, లక్ష్మీనరసింహ, నెట్టెం బాలకృష్ణ, బాబాఫకృద్దీన్, రంగాచారి, సీసాల శ్రీనివాసులు, కొండవీటి భావన, స్వప్న, బల్లా పల్లవి, రహమత్ బీ, సంగా తేజస్విని, జనసేన నాయకురాలు పెండ్యాల శ్రీలత పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే..పేదల సంక్షేమం

శింగనమల, సెప్టెంబరు 25: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. మండ లంలోని నాగులగుడ్డం గ్రామంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. నాయకులు వినోద్‌కుమార్, రాఘవ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: మండలంలోని తల్లిమడుగుల గ్రామంలో బుధవారం సర్పంచ్ ఈడిగ రామాంజినేయులు, మాజీ సర్పంచ్ పతకమూరి ఆంజనేయులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారు లతో కలిసి ఇంటింటా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు మనోహర్‌నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ బీసీల పక్షపాతి అని నిరూపించిన సీఎం

● బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 25 : తెలుగుదేశం పార్టీ బీసీల పక్షపాతి అని సీఎం చంద్రబాబు మరో సారి నిరూపించారని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య పేర్కొన్నారు. ఆయన బుధవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్రతో కలిసి మీడియాతో మాట్లాడారు. నామినేటెడ్ పోస్టుల్లో ఎక్కువ శాతం బీసీలకే కేటాయించారన్నారు. నాయకులు ఓబుళపతి, వన్నూరు, మల్లికార్జున, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీపై రథం కేసు సరికాదు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం క్రైం, సెప్టెంబరు 25 : కణేకల్లు మండలం హనకహాల్ గ్రామంలో గ్రూపు తగాదాలతో జరిగిన ఘటనను వైసీపీపై ఆపాదించడం సరికాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాములోరి రథాన్ని కాల్చడం బాధాకరమని, ఈ ఘటనను అందరూ ఖండించాల్సిందేనన్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేసి దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. 10మందిని పోలీసులు అరెస్ట్ చేశారని, కానీ ఎస్పీ ప్రెస్‌మీట్ పెట్టి ఈశ్వర్‌రెడ్డి వైసీపీ నాయకుడు అని చెప్పడం బాధాకరమన్నారు. తిరుమల పవిత్రత, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేశారన్నారు. ప్రక్షాళన చేసేందుకు ఈనెల 28న జిల్లా వ్యాప్తంగా ఆలయా ల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

రూ.వంద పనైనా చేశారా?: మేయర్ వసీం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 25 : దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎమ్మెల్యే అయ్యాక నగరంలో రూ.100 పనైనా చేశారా అని నగర మేయర్ మహమ్మద్ వసీం ప్రశ్నించారు. ఆయన బుధవారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ సైఫుల్లాతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రాక ముందు రూ.1045కోట్ల అభివృద్ధి జరిగిందని, అధికారంలోకి వచ్చాక రూ.100 నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. రూ.160కోట్ల పారిశుధ్య నిర్వహణ నిధుల్లో వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే, మేయర్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. నగర అభివృద్ధికి తమ సహకారం అందిస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

- మొక్కలు నాటిన ఎస్పీ జగదీష్, ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఆవరణంలో బుధవారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమానికి ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి, మేనేజర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'సనాతన సంప్రదాయాలను కాపాడాలి'

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 25 : హిందూ దేవాలయ వ్యవస్థలోని సనాతన సంప్రదాయాలను కాపాడాలని మంజునాథ స్వామి సేవా సంఘం అధ్యక్షుడు మఠం బసవరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రామతులసిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై హిందువులందరి మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. తాజాగా హనకనహాల్‌లో రాములవారి రథానికి నిప్పు పెట్టడం శోచనీయమన్నారు. దేవాలయాలు, పరిసర ప్రాంతాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

పేదల భూముల లాక్కున్న వారి ఆటకట్టిస్తాం : ఎమ్మెల్యే సునీత

చెన్నేకొత్తపల్లి: గత వైసీపీ పాలనలో మండలంలో విచ్చలవిడిగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే పరిటాలసునీత విమర్శించారు. వారి చిట్టా తమవద్ద ఉందని, త్వరలో వారి ఆటకట్టిస్తామన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బుధవారం మండలంలోని ప్యాధిండి, చందమూరు, ఎన్ఎస్‌గేటు, చెన్నేకొత్తపల్లి, హరియన్ చెరువు గ్రామాల్లో పర్యటించారు. రూ.3.60 కోట్లతో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. చెన్నే కొత్తపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... మండలంలో జరిగిన భూ ఆక్రమణలపై ప్రత్యేకంగా విచారణచేయించి బాధ్యులు ఎంతటివారైనా చర్యలు తీసుకుంటమన్నారు. బాధితులకు తిరిగి ఇప్పిస్తామన్నారు. అలాగే చందమూరులో పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. హరియన్‌చెరువులో బ్లాక్ ప్లాంటేషన్ కార్యక్రమం కింద మొక్కలను నాటారు. ఎమ్మెల్యేకు పలువురు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అశోక్‌నాయక్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఏఓ ఉదయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణ, ఎంఈఓ-1,2లు మున్వర్‌బాషా, ప్రసూన్‌కుమార్‌నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు ఎల్‌నారాయణచౌదరి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, జనసేన కన్వీనర్ క్రాంతికుమార్, బీజేపీ నాయకుడు జిలకర ఆంజనేయులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు : ఎమ్మెల్యే

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 25: ప్రజలకు వైద్యసేవలు అందించ డంలో నిర్లక్ష్యం వహించవద్దని, మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే పరి టాల సునీత ఆస్పత్రి సిబ్బందిని ఆదేశించారు. ఆమె బుధవారం చెన్నే కొత్తపల్లిలోని ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని ప్రతిగదిని పరిశీలించారు. ఆస్పత్రిలో మందుల నిల్వ, రోగులకు అందుతున్న సేవలపై వైద్య సిబ్బంది, రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజల వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమకట్టడాల పరిశీలన

అనంతపురంరూరల్, సెప్టెంబరు25: మండలంలోని కురుగుంట పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కాలనీకి ఆనుకుని కట్టిన అక్రమాలను తహసీల్దార్ మోహన్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మూడు రోజుల కిందట కాలనీలో ఎమ్మెల్యే పరిటాల సునీత పర్యటించిన విషయం విదితమే. కాలనీలోని నీరు బయటకు వెళ్లకుండా కొందరు వెంచర్‌దారులు కాలనీకి ఆనుకుని ప్రహరీ నిర్మించినట్లు స్థానికులు పలువురు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించడంతో తహసీల్దార్ మోహన్‌కుమార్ కాలనీకి వెళ్లి పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేస్తామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం : ఎస్కేయూ వీసీ

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 25 : విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత కళాశాలలకు సూచించారు. యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో వీసీ మాట్లాడుతూ.. వర్సిటీలో స్పోర్ట్స్ విభాగాన్ని అభివృద్ధి చేసి క్రీడలకు అవసరమైన పరికరాలను సమకూర్చామన్నారు. ప్రతి కళాశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(పీఈడీ)ను ఖచ్చితంగా నియమించాలన్నారు. గతంలోలాగా పీఈడీలను ఇతర పనులకు వినియోగిస్తే సంబంధిత కళాశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, క్రీడావిభాగం కార్యదర్శి జెర్సీ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే ఉద్యమిస్తాం

● సీపీఐ జిల్లా అధ్యక్షుడు జాఫర్

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు25: కూటమి ప్రభుత్వం ఎన్నికలు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాలకు శ్రీకారం చుడతామని సీపీఐ జిల్లా అధ్యక్షుడు జాఫర్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక వాల్మీకి దేవాలయంలో బుధవారం సీపీఐ నియోజకవర్గం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు హాజరై మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చి వంద రోజుల పాలనలో అభివృద్ధి శూన్య మన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు మల్లిస్వామి, రామకృష్ణ, పెద్దయ్య, సీవీ హరికృష్ణ తరిమెల రామాంజి, ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ప్రతి ఒక్కరు ఆరోగ్యం కాపాడుకోవాలి

ఎంపీ అంబికా, కలెక్టర్ సూచన

అనంతపురం టౌన్, సెప్టెంబరు25 : ఎంతసంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే వ్యర్థమని, ప్రతి ఒక్కరు ఆరోగ్యం కాపాడుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ, కలెక్టర్‌తో పాటె జడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు, తొలుత మహిళా అధికారులు సాయిసంస్థ ఏర్పాటుచేసిన సామూహిక సీమంతం కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం ఎంపీ, కలెక్టరు మాట్లాడుతూ... గర్భిణులకు ప్రభుత్వంకూడా ప్రసవం తర్వాత ఐదునెలల పాటు పోషకాహారం అందిస్తుందని విధిగా తీసుకోవాలన్నారు. వ ఆరోగ్యం ప్రాముఖ్యతను గ్రామస్థాయినుంచే ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అసిస్టెంట్ కలెక్టరు వినూత్న మాట్లాడుతూ ఈనెలాఖరికి పోషకమాసోత్సవాలు ముగుస్తాయన్నారు. మరో ఐదురోజులుమాత్రమే ఉన్నాయని కార్యక్రమాలు మంచిగా కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌పీడీ శ్రీదేవి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీదేవి, డిప్యూటీ మేయర్ కొగటం విజయబాస్కరరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

దసరా లోగా 2023 పంటల బీమా ప్రకటించాలి

● ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



రైతులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న రైతుసంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 25 : రానున్న దసరా పండుగ లోగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. 2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ ప్రకటించాలని, కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలనే పలు డిమాండ్ల సాధన కోసం ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి బుధవారం స్థానిక క్లాక్‌టవర్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... 2023 ఖరీఫ్, రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులేర్పడి, రైతులు సాగు చేసిన పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాలను, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా కరువు నివారణకు ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. 2023 ఖరీఫ్, రబీ పంట బీమా ప్రకటించాలని, కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చి రుణాలు, పంట నష్టపరిహారం అందజేయాలన్నారు. దసరాలోగా ఇన్సూరెన్స్ ప్రకటించకపోతే చలో విజయవాడ కార్యక్రం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివారెడ్డి, విరూపాక్షి, రాజారాంరెడ్డి, చెన్నారెడ్డి, శ్రీనివాసులు, నల్లప్ప, సంగప్ప, పోతులయ్య, చిదంబరయ్య, వెంకటకొండ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

అనంతపురం కల్చరల్ : రెవెన్యూ అధికారులు చేసిన నిర్లక్ష్యం వల్ల ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు సూర్యనారాయణ కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట బుధవారం ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతు సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెవెన్యూ సదస్సు జరిపి భూ సమస్యలు పరిష్కరించి, రైతులను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థినులు తిరిగేదెలా..?

హాస్టల్ గేటు ఎదుటే వాహనాల పార్కింగ్



అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు25 : నగరంలోని గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న ఎస్సీ, బీసీ బాలికల వసతిగృహాల గేటు ప్రాంతం వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. సమీపంలో ఆస్పత్రులు, కాంపౌండ్‌కు ఆనుకొని టీస్టాల్ ఉండటంతో అక్కడికొచ్చే వారు తమ వాహనాలను తీసుకొచ్చి హాస్టల్ గేటు ఎదుట నిలిపి వెళ్తున్నారు. దీంతో హాస్టల్లోకి వెళ్లేందుకు.. బయటికి వచ్చేందుకు విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. తాము పలుమార్లు చెప్పినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వార్డెన్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు హాస్టల్ వద్ద వాహనాలను పార్కింగ్ చేయకుండా చూడాలని వార్డెన్లు, విద్యార్థినులు కోరుతున్నారు.

సంఘాల నాయకుల వేధింపులను అరికట్టండి

● ఎస్పీకి జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఫిర్యాదు



ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 25 : విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకుల వేధింపులు అధికమయ్యాయని, వాటిని నియంత్రించాలంటూ అనంతపురం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు జిల్లా ఎస్పీని కోరారు. వారు బుధవారం ఎస్పీ జగదీష్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గత కొన్ని నెలలుగా ఎన్నడూ లేని విధంగా విద్యార్థి, కుల సంఘాల నాయకులు, సంఘాల ముసుగులో కొందరు యువకులు ప్రైవేట్ పాఠశాలల్లోకి వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. చందాల రూపంలో డబ్బులు అడుగుతూ....ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. చిన్నపాటి పాఠశాలల కరస్పాండెంట్లు చాలా అవస్థలు పడుతున్నార న్నారు. అలాంటి సంఘాల నేతలపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సీఆర్వో రవిచంద్రారెడ్డి, జిల్లా కోశాధికారి రామచంద్ర, ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర, నగర గౌరవాధ్యక్షుడు శ్రీవాత్సవ, నగర అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నగర కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి జానకీ రాములు, ఉపాధ్యక్షులు రఫీ ఉప కార్యదర్శి రాజా రమేష్ ఇతర నాయకులు మలోబన్న, కొండారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

వైసీపీదే పెత్తందారీ వ్యవస్థ : టీడీపీ

ఆత్మకూరు, సెప్టెంబరు 25 : రాజకీయపార్టీలో పెత్తందారీ వ్యవస్థ వైసీపీదేనని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు బుధవారం విమర్శించారు. దళితులకు టీడీపీలోనే సముచిత స్థానం ఉంటుందన్నారు. జగన్ పత్రికలో ప్రొటోకాల్‌కు మంగళం అనే వార్త ప్రకటించడంలో ఎలాంటి వాస్తవం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభోత్సవాలు చేయడం ఓర్చుకోలేక తప్పుడుప్రచారాలతో వైసీపీ కాలం గడపాలని చూస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఇచ్చిన తీర్పుతో బుద్ధి తెచ్చుకోవాలన్నారు.

పోలీసుల అదుపులో వైసీపీ నాయకుడు

అనంతపురం క్రైం: వైసీపీ నాయకుడు ఆంథోనిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ జగదీష్‌కు బాధితులు చేసిన ఫిర్యాదు ఆధారంగా ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎస్పీ ప్రత్యేకంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. రూ.కోట్లలో మోసం చేశాడనే ఫిర్యాదుపైనే విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్-19 క్రీడా పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-19 ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలు ఈనెల 27వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్-19 జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. 27న వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్ పోటీలు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉంటాయన్నారు. 28న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, చెస్, నెట్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు. 30న బాస్కెట్‌బాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఉంటాయన్నారు. అక్టోబరు 1వతేదీన అథ్లెటిక్స్, హాకీ, కోకో పోటీలు ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9441284618ను సంప్రదించాలని కోరారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు నసనకోట విద్యార్థులు



ఎంపికైన నసనకోట విద్యార్థులు

రామగిరి, సెప్టెంబరు 25: మండలంలోని నసనకోట పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి అండర్-14 జూడో పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం నాగరత్నమ్మ, పీడీ చామంతి తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వరకు తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో ఎంపిక పోటీల్లో 25 కేజీల విభాగంలో జయసింహ, 40 కేజీల విభాగంలో కావ్య బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అక్టోబరు 4వతేదీ నుంచి 8వతేదీ వరకు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు 50 మంది ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 బాల, బాలికల అర్బన్ నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్ పోటీలు బుధవారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించారు. త్రోబాల్, లాంగ్ జంప్, హైజంప్, రన్నింగ్ పోటీలకు సుమారు 500మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో 50మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, పీడీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ఏపీఆర్ మైనార్టీ స్కూల్ విద్యార్థులు

గార్లదిన్నె, సెప్టెంబరు25: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో జరిగిన అథ్లెటిక్ పోటీ విభాగాల్లో ఏపీఆర్ మైనార్టీ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. తొమ్మిది మంది ప్రథమ స్థానంలో నిలువగా, ఐదుగురు ద్వితీయ స్థానం, ముగ్గురు తృతీయ స్థానం సాధించారు. స్కూల్‌లో పీఈటీ లేకుండానే పోటీల్లో మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ అంజనేయులు నాయక్ తెలిపారు.

నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ ప్రారంభం

రామగిరి, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17 బాల, బాలికల నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంఈఓ శ్రీనివాసులు ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నా రు. రెండు రోజులపాటు క్రీడాపోటీలు నిర్వహించి జిల్లాస్థాయి క్రీడాకారులను ఎంపిక చేస్తామని మండల కో ఆర్డినేటర్ కోటప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ బంగారప్ప, నాయకులు ఎస్ అంజనేయులు, అక్కులప్ప, పేపర్‌శీన, ముత్యాలప్ప, గుర్రం శీన, విశ్వనాథ్ పాల్గొన్నారు.


నాగసముద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం


రాయదుర్గంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ


నీర్జాంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ


చిన్నముష్టూరులో స్టిక్కర్లు విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, సెప్టెంబరు 25: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని, అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఆయన పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజల మనసులు చూరగొన్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని నాగసముద్రం గ్రామంలో బుధవారం ఆర్డీవో శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రజలు చంద్రబాబుపైనే నమ్మకాలు పెట్టుకుని గెలిపించారన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పలు పథకాలు అమలు చేశారని, మిగిలిన వాటిని త్వరలో సూపర్ అమలు చేస్తారని చెప్పారు. నాగసముద్రం, పులగుట్టపల్లి గ్రామాల వద్ద వంకలపై వంతెనలను నిర్మిస్తామని, త్వరలో టెండరు ప్రక్రియ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. నాగసముద్రం రహదారిని డబుల్ రోడ్డుగా మారుస్తమని ప్రకటించారు. అనంతరం కౌలు రైతుల గుర్తింపు కార్డులు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు బీఎస్ కృష్ణారెడ్డి, పత్తి హిమబిందు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, నియోజవర్గ ప్రత్యేక అధికారి నరసింహరావు, తహసీల్దారు రమాదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలు: ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంటౌన్: గత ఐదేళ్లలో వైఎస్ జగన్ తన అసమర్థ పాలనతో స్వర్ణాంధ్రప్రదేశ్‌ను రుణాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. పట్టణంలోని ఆరో వార్డులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ తన పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. అయినప్పటికీ చంద్రబాబు సంక్షేమ పథకాల్లో ఎలాంటి కోత విధించకుండా కొనసాగిస్తున్నారని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో రాయదుర్గం పట్టణంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు నిర్మించి ఇస్తామని హామీని ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, నాయకులు టంకశాల హనుమంతు, పొరాళ్ల పురుషోత్తం, కౌన్సిలర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

దత్తత తీసుకున్నా ప్రయోజనం లేకపాయ: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

యల్లనూరు: గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే గ్రామాన్ని దత్తత తీసుకున్నప్పటికీ ప్రయోజనం లేదని ప్రజలే చెబుతుంటే చాలా బాధగా ఉందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని నీర్జాంపల్లి గ్రామంలో ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గత పాలకులు ఐదేళ్ల కాలంలో గ్రామంలో కనీస అవసరాలు అయిన తాగు నీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించలేని స్థితిలో పాలన సాగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా గ్రామానికి రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం మంజూరు చేశామని తెలిపారు. విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. మాజీ సర్పంచు గోపాల్, టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు కల్లూరు మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

చిన్న ముష్టూరులో ఇది మంచి ప్రభుత్వం

ఉరవకొండ: మండలంలోని చిన్న ముష్టూరు గ్రామంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు నెట్టెం రాంబాబు, పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వం ఈ వంద రోజుల్లో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే ప్రతిఇంటికీ కార్యక్రమం స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో నాయకులు నెట్టెంశివరామ్, నాగరాజు, పులీంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలకేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో టీడీపీ నాయకులు నాయకులు హరి, మారుతి, ప్రతాప్, సందీప్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని 74 ఉడేగోళం, రాయంపల్లి, బీఎన్‌హళ్లి, మల్లాపురం, పల్లేపల్లి తదితర గ్రామాలలో అధికారులు, టీడీపీ నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు కాటా వెంకటేశులు, శివానంద, పురుషోత్తం, పృథ్వీ, తిప్పేస్వామి, ఓబయ్య, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో రామచంద్ర, టీడీపీ నాయకులు మల్లికార్జున, తిప్పయ్య, వెంకట్రామిరెడి శ్రీరాములు, నారాయణ స్వామి, వన్నూరుస్వామి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 9, 16వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ కౌన్సిలర్ ఆర్షియాబేగం, మాజీ కౌన్సిలర్లు రమేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ, మెప్మా టీపీఓ మోహన్, స్కూల్‌మేనేజ్‌మెంట్ ఛైర్మన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 370 గోకులం షెడ్లు మంజూరు


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ

ఉరవకొండ, సెప్టెంబరు 25: జిల్లాకు 370 గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని పశుసంవర్థక శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాకు 370 దాకా గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని, ఒక్కొక్క మండలానికి 47 దాకా మంజూరైనట్లు తెలిపారు. వాటి నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని వెల్లడించారు. పశుపోషణ బీమా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకంలో ప్రభుత్వం 80శాతం ప్రీమియం చెలిస్తుందన్నారు. ప్రమాదవశాత్తు పశువులు చనిపోతే రూ.30వేల నుంచి రూ.1.2లక్షల దాకా పరిహారం వస్తుందన్నారు. వచ్చేనెల 1 నుంచి 15వ తేదీ వరకూ డీవార్మింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 27లక్షల దాకా గొర్రెలు, మేకలు ఉంటాయన్నారు. గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమం కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ వెంకటేశ్వర్లు, ఏడీ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి, సెప్టెంబరు 25: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. అండర్‌డ్రైనేజీ, మ్యాన్‌హోల్, రోజువారీ వేతనం, పైప్‌లైన్, మోటార్లు, వాహనాల మరమ్మతులపై కౌన్సిల్ జరిగింది. ట్రాక్టర్ల మరమ్మతుల కోసం రూ.5లక్షలు, మోటార్ల బాక్సులు, ట్యాంకులు, పీవీసీ పైపుల మరమ్మతుల కోసం రూ.5లక్షలు, అన్నక్యాంటీన్ పునఃప్రారంభించడానికి రూ.9లక్షలు, అదనంగా మరో రూ.3లక్షలు, గండికోట రిజర్వాయర్, పెన్నానది నుంచి 10హెచ్‌పీ, 15హెచ్‌పీ మోటార్ల ద్వారా 4పంపింగ్ స్టేషన్లకు పంపిణీ చేయుటకు మోటార్లు, ప్యానెల్ బోర్డుల కొరకు రూ.5లక్షలు మంజూరు చేశారు. అలాగే ఎస్టీపీ -1లో అత్యవసర మరమ్మతుల కోసం రూ.10లక్షలు , ఎస్టీపీ-2 మెయిన్‌గేటు వద్ద అండర్ డ్రైనేజీ పైప్‌లైను కుంగిపోవడం వల్ల మరమ్మతుల కోసం రూ.9లక్షలు ఆమోదించామని వైస్‌చైర్మన్ తెలిపారు. వైస్ ఛైర్‌పర్సన్ సరస్వతి, కౌన్సిలర్లు మల్లికార్జున, విజయ్‌కుమార్, అరుణ, రేష్మాపర్వీన్, లక్ష్మిదేవి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు


నిందితులను చూపుతున్న రూరల్ సీఐ

తాడిపత్రి, సెప్టెంబరు 25: మండలంలోని సజ్జలదిన్నె గ్రామం వద్ద గైని నాగరాజు, గైని వెంకటేశ్వర్లును అనే ఇద్దరు ద్విచక్రవాహనాల దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈనెల 24న మండలంలోని వెంకటాంపల్లి గ్రామ సమీపంలోని పొలంలో డేరంగుల వెంకటప్రసాద్ అనే వ్యక్తి తన పొలం వద్ద ద్విచక్రవాహనాన్ని నిలిపిఉంచి పొలంలో పనులు చేసుకుంటుండగా.. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన గైని నాగరాజు ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడన్నారు. గమనించిన డేరంగుల వెంకటప్రసాద్ మరికొందరి సాయంతో నిందితున్ని వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారన్నారు. అనంతరం పోలీసులు తమదైన శైలిలో విచారించగా మరికొన్ని ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు నిర్ధారణ అయిందన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు మండలంలోని సజ్జలదిన్నె గ్రామం వద్ద దొంగిలించిన ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని వాటికి కాపలాగా ఉన్న గైని వెంకటేశ్వర్లును అరెస్టు చేశామన్నారు. ఇరువురు నిందితులు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. అనంతరం వీరిని రిమాండ్‌కు పంపామని సీఐ తెలిపారు.

పంట పొలాలను పరిశీలించిన ఢిల్లీ శాస్త్రవేత్తలు


పంట పొలాలను పరిశీలిస్తున్న ఢిల్లీ శాస్త్రవేత్తలు

కుందుర్పి, సెప్టెంబరు 25: మండలంలోని తమ్మయ్యదొడ్డి గ్రామంలో గల పంట పొలాలను బుధవారం ఢిల్లీ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఏఎఫ్ఏ కాలేజీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆ గ్రామ రైతులు ప్రకృతి వ్యవసాయంతో అనేక పంటలను పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి పంటలను ఢిల్లీ శాస్త్రవేత్తలు పంజాబ్ సింగ్, అనిల్ కుమార్ సింగ్‌ల బృందం పరిశీలించారు. సాగు పద్ధతులపై రైతులనడిగి తెలుసుకున్నారు. చాలా ఏళ్ల క్రితం ప్రకృతి వ్యవసాయం చేసేవారని, అప్పటికి.. ఇప్పటికి తేడా ఏమిటనే దానిపై వారు ఆరా తీశారు.

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు

గుత్తి, సెప్టెంబరు 25: పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది బుధవారం పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. రెండు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను గుర్తించి స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ బేకరీలో, రఘురామరెడ్డి కాంప్లెక్స్‌లోని ఓ సరుకుల దుకాణంలో తనిఖీలు చేసి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను, గ్లాసులను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్, నిషేధిత కవర్లను ఎవరూ అమ్మరాదని, వినియోగించరాదని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 25: మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో గల జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత తాగడానికి నీరు లేవన్నారు. చేసేదిలేక సంపులో ఉన్న నీటిని తాగుతున్నారని అన్నారు. అలాగే మధ్యాహ్న భోజనంలో ఉడకని అన్నం, ఉడకిని గుడ్లను అందిస్తున్నారని వాటిని తిని విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎంను సస్పెండ్ చేసి రెగ్యులర్ హెచ్‌ఎంను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకీ, నాయకులు సమీర్, కేశవ, సయ్యద్, సాయి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం


ఉరవకొండలో పరుగు పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఉరవకొండ, సెప్టెంబరు 25: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని తహసీల్దార్ మహబూబ్ బాషా సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికల నియోజక వర్గ స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. అంతకు మునుపు తహసీల్దార్ క్రీడా పతాకాన్ని ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఈశ్వరయ్య, టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు రామాంజనేయులు, విజయ్ భాస్కర్, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, పాఠశాల కమిటీ ఛైర్మెన్ గోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మారుతి, నాగరాజు, ప్రభాకర్, మంజునాథ్, రాఘవేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో కుందుర్పి విద్యార్థుల సత్తా

కుందుర్పి: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు నిర్వహించారు. అండర్-17 బాలురు విభాగంలో కుందుర్పి పాఠశాల విద్యార్థులు బెస్తరపల్లి విద్యార్థులపై విజయం సాధించారు. బాలికల విభాగంలో కుందుర్పి విద్యార్థులు యర్రగుంట విద్యార్థులపై విజయం సాధించారు. వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: ఉరవకొండలో నిర్వహించిన ఏపీ స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస విద్యానికేతన్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలలో సత్తా చాటారు. అండర్-14 విభాగంలో బి హేమంత్‌కుమార్ మొదటి స్థానంలో నిలిచారు. నిఖిల్ అండర్-17 విభాగంలో 5వ స్థానంలో నిలిచి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. పరుగుపందెంలో చందన రెండో స్థానంలో రాణించారు.

రాయదుర్గంరూరల్: డీ.హీరేహాళ్ మండలం సోమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని జుంజురంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు లక్ష్మి , వనజాక్షి హమరన్‌జిన్, సంధ్య, శ్రీజ, అయేషా, తిప్పేష్, సంతోష్ తదితరులు ప్రతిభ చాటారు. వారిని హెచ్‌ఎం అభినందించారు.

కళ్యాణదుర్గం: నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ముగిశాయి. దాదాపుగా మండలంలోని ఎనిమిది పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసినట్లు మండల కోఆర్డినేటర్ ఓబులేసు తెలిపారు.

నేడు మంత్రి సవిత రాక

కణేకల్లు, సెప్టెంబరు 25: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ గురువారం కణేకల్లు మండలకేంద్రంలో జరిగే ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధ్యక్షతన కార్యక్రమం జరగనుందని, ఇందుకు ముఖ్యఅతిథిగా మంత్రి రానున్నారని చెప్పారు. మండలంలోని టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులు బదిలీ

బొమ్మనహాళ్, సెప్టెంబరు 25: మండలం నుంచి నలుగురు పంచాయతీ కార్యదర్శులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయినట్లు ఈఓపీఆర్డీ దాస్ తెలిపారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బొల్లనగుడ్డం ఉంతకల్లు, బొమ్మనహాళ్, దర్గాహొన్నూరు గ్రామ పంచాయతీల కార్యదర్శులు లోకేష్, రవికుమార్, బాబా ఫక్రుద్దీన్, కుళ్లాయినాయుడు వజ్రకరూరు, విడపనకల్లు, రాప్తాడు మండలాలకు బదిలీ అయినట్లు తెలిపారు. అలాగే బొల్లనగుడ్డం పంచాయతీకి గుంతకల్లు నుంచి గోవిందరెడ్డి, దర్గాహొన్నూరుకు వజ్రకరూరు నుంచి జీ వెంకటేష్, బొమ్మనహాళ్‌కు పెద్ద వడుగూరు నుంచి కృష్ణారావు, శ్రీధరఘట్ట కు డీహీరేహాళ్ నుంచి నాగరాజు, శింగనహళ్లికి విడపనకల్లు నుంచి బీవెంకటేశ్ కార్యదర్శులుగా వస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దవడుగూరు, సెప్టెంబరు 25: మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామ సమీపంలోని వంక పరివాహక ప్రాంతంలో ఇసుకను బుధవారం అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రెడ్డప్ప తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. ఎవరైనా ఇసుక, ఎర్రమట్టిని అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

బెళుగుప్ప, సెప్టెంబరు 25 : నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ షర్మిల రేషన్ డీలర్లను హెచ్చరించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె డీలర్లతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రతి రేషన్‌కార్డుదారుకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను డీలర్లు, ఎంఎస్‌ఎంలు సక్రమంగా పంపిణీ చేయాలని తెలిపారు. ఏమాత్రం అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ హుస్సేన్ పీరా, ఆర్ఐ నగేష్ పాల్గొన్నారు.

నీలి మీడియా.. నీచపు రాతలు

● టీడీపీ నాయకుల మండిపాటు

కణేకల్లు, సెప్టెంబరు 25: మండలంలోని హనకనహాళ్ గ్రామంలో రథం దగ్ధం చేసిన సంఘటనను నీలి మీడియా పక్కదారి పట్టించేందుకు టీడీపీపై ఆరోపణలు చేస్తూ కథనాలు రాయడంపై ఆ పార్టీ నాయకులు మండిపడ్డారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఎస్కే మల్లికార్జున, వాల్మీకి నాగార్జున విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రథానికి నిప్పు పెట్టిన సంఘటనలో వైసీపీ నాయకులు ఉన్నారని ముందుగానే తెలుసుకున్న నీలి మీడియా ఆ సంఘటనను పక్కదారి పట్టించే ధోరణిలో టీడీపీ నాయకులకు ఆపాదిస్తూ కథనాలు రాస్తోందన్నారు. దీన్ని బట్టి చూస్తే నీలి మిడియా విలువలు ఏ స్థాయికి దిగజారాయో అర్థమవుతుందన్నారు. హనకనహాళ్ గ్రామానికి చెందిన వైసీపీ బోడిమల్లి ఈశ్వర్‌రెడ్డి ఈ సంఘటనకు ప్రధాన సూత్రదారి ఎస్పీ బుధవారం ప్రకటించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపిన ఈ సంఘటనను టీడీపీపై వేయాలని వైసీపీ నాయకులు కుటిల యత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఇలాంటి వారికి తగిన శాస్తి చేయాలని కోరారు.

పవన్ కల్యాణ్ దీక్షకు మాజీ ఎమ్మెల్యే మద్దతు

గుత్తి, సెప్టెంబరు25: తిరుపతి లడ్డూలో నెయ్యి కల్తీ జరగడంపై ప్రాయశ్చిత్తంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 11రోజులు దీక్ష చేపట్టారని ఆ దీక్షకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా పేర్కొన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించడానికి ముందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు తాము మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా హజరత్ సయ్యద్ బాషా ఉరుసు

గుత్తి, సెప్టెంబరు 25: గుత్తికోటలో వెలసిన హజరత్ సయ్యద్ బాషా ఖాద్రీ రహంతుల్లా అలాయి ఉరుసు ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద నుంచి షంషీర్‌ను పురవీధుల గుండా ఊరేగించారు. రాత్రి ఆర్కెస్ట్రా పోటీలను నిర్వహించారు. భక్తులు స్వామి వారికి చక్కెర చదివింపులు చేయించారు.

రూ.50 వేల విరాళం


సీఎంకు చెక్కును అందజేస్తున్న లెనిన్‌బాబు

కుందుర్పి, సెప్టెంబరు 25 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలకేంద్రానికి చెందిన సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్ బాబు రూ. 50 వేలు విరాళం ఇచ్చారు. ఆయన సీఎం చంద్రబాబును విజయవాడలో బుధవారం కలిసి ఈ మేరకు చెక్కును అందజేశారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 25: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సీఐ వెంకటరమణ కాలనీవాసులకు సూచించారు. పట్టణంలోని 13వ వార్డు వడ్డే కాలనీలో బుధవారం ఆయన ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని, ఫోన్లు చేసి ఓటీపీ అడుగుతున్నారని, అలాంటప్పుడు జాగ్రత్తపడాలని తెలిపారు. తెలియని వ్యక్తుల ఫోన్ చేసి ఓటీపీ నెంబర్ అడిగితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవగాహన, అప్రమత్తత ఉంటేనే సైబర్ నేరాలను అరికట్టవచ్చునని పేర్కొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ



చిరువ్యాపారులకు తోపుడు బండ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 25 : పట్టణంలోని ప్రజావేదిక వద్ద బుధవారం స్థానిక నిరుపేద చిరువ్యాపారులకు పది మందికి ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. సుమారు రూ. 2.50 లక్షల విలువ జేసే బండ్లను ఆయన వారిని అందించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పూర్ టు రిచ్ దిశగా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే చిరువ్యాపారులను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే ఈ తోపుడు బండ్లను పంపిణీ చేశామని తెలిపారు. చిరువ్యాపారులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు.

స్వర్ణాంధ్ర 2047పై అధికారుల సమావేశం

యాడికి, సెప్టెంబరు 25: మండలకేంద్రంలోని సమావేశ భవనంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు అన్నిశాఖల మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించాలనే ధ్యేయమే స్వర్ణాంధ్ర 2047 ప్రణాళిక అని తెలిపారు. 2047సంవత్సరంలో భారతదేశం 100 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించుకుంటుందని, ఆ సమయానికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలన్న లక్ష్యంతో స్వర్ణాంధ్ర 2047 అని పెట్టారని తెలిపారు. ఈ దిశగా అధికారులు కృషిచేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటేష్, ట్రాన్స్‌కో ఏఈ రాజారావు, ఎంఈఓ కాశప్ప, ఏఓ మహబూబ్‌బాషా, హార్టికల్చర్ అధికారి ఉమాదేవి, వెటర్నరీ డాక్టర్ విజయలక్ష్మి, ఏపీఎం చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు రుణాలను వినియోగించుకోండి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 25: సహకార సంఘం బ్యాంకు పరిధిలో ఉన్న రైతులకు అన్ని రకాల రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఫణి భూషణ్ తెలిపారు. మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో బుధవారం ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ కార్యక్రమాన్ని 74 ఉడేగోళం సహకార సంఘం సీఈఓ కేసీ ఆంజినేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ సహకార సంఘం పరిధిలో సభ్యులుగా ఉన్న రైతులకు ఏడీసీసీ బ్యాంక్ ద్వారా దీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు క్రాప్‌లోన్లు, పండ్ల తోటల పెంపకానికి రుణాలు, ఇరిగేషన్, ఎడ్యుకేషన్ నిర్వహణకు దీర్ఘకాలిక రుణాలను అందిస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ అశోక్, సహకార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

తాడిపత్రి, సెప్టెంబరు25: మండలంలోని గన్నెవారి పల్లికాలనీకి చెందిన ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త రామాంజనేయులుపై అదనపు కట్నం కింద కేసు నమోదుచేసినట్లు బుధవారం రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలమేరకు అనంతపురం జిల్లాలోని ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన రామాంజనేయులుతో ప్రశాంతికి రెండేళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.3లక్షల నగదు, 3తులాల బంగారు కట్నం కింద ఇచ్చారు. కానీ గత కొద్దిరోజుల నుంచి అదనపు కట్నం తేవాలని భార్య ప్రశాంతిపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో ప్రశాంతి పుట్టింటికి చేరుకుంది. అయినప్పటికి కట్నం తేవాలంటూ భర్త ఒత్తిడి చేయడంతో చివరికి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఫిర్యాదు మేరకు భర్తపై అదనపు కట్నం కింద కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


శేషు (ఫైల్)

పెద్దవడుగూరు, సెప్టెంబరు 25: మండలకేంద్రానికి చెందిన శేషు (35) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలో ఎవరూలేని సమయంలో ఆయన ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య శివమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు కింద పడి మరొకరు ..


గోపాల్ (ఫైల్)

గుత్తి, సెప్టెంబరు 25: పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాల సమీపంలో బుధవారం రైలు కింద పడి అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన గోపాల్ (50)అనే ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. అబ్బేదొడ్డిలో గత మూడు రోజుల క్రితం గోపాల్‌కు భార్య సుమలతతో చిన్నపాటి గొడవ జరిగింది. అతను కర్రతో దాడి చేసి భార్యను గాయపరచాడు. ఈ విషయంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య పరిస్థితి విషమంగా ఉందనే విషయాన్ని తెలుసుకున్న గోపాల్ తీవ్ర మనస్థాపం చెందాడు. దీంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

ముగ్గురి అరెస్టు


తాడిపత్రి, సెప్టెంబరు 25: మండలంలోని ఊరుచింతల గ్రామం వద్ద గత నెల 27న అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సూర్యనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మారుతిలను బుధవారం అరెస్ట్‌చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అప్పట్లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అందులో భాగంగా వీరిని కడపరోడ్డులో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

తాడిపత్రి, సెప్టెంబరు 25: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన వైసీపీ మద్దతుదారుడు భార్గవరాయుడుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. సోషల్‌మీడియాలో అతను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినట్లు పలువురు తమకు ఫిర్యాదు చేశారని, దీంతో ఆ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

తెగుళ్లను నివారిస్తేనే అధిక దిగుబడులు

● పొలం పిలుస్తోందిలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచన


గుత్తి మండలం తొండపాడులో జరిగిన పొలం పిలుస్తోందిలో వ్యవసాయాధికారులు, రైతులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటల్లో పూర్తిస్థాయిలో తెగుళ్లను నివారిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని హలికల్లు రైతుసేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పంటల సాగుపై పలు సూచనలు చేశారు. అలాగే పొలాలను సందర్శించి, పంటలను పరిశీలించారు. ఏడీఏ యల్లప్ప, ఏవో జగదీష్ హార్టికల్చర్ అధికారి ఫిరోజ్ బాషా, సర్పంచ్ చిత్తప్ప, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తి మండలం తొండపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, ఏఓ మేహరుషా బేగం, ఏఈఓ కృష్ణభగవన్, ఎంపీఓలు, రైతులు పాల్గొన్నారు. పామిడి మండలం వంకరాజుకాలువ, నెమళ్లపల్లి రెవెన్యూ గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఏఓ లీనావసుందర ఏఈఓ శ్రీనివాసరావు, వీఏఏ శ్రీకాంత్, ఏపీఎంఐపీ రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు. వజ్రకరూరు మండలం గడేహోతూరు, పొట్టిపాడు గ్రామాల్లో, ఉరవకొండ మండలం కోనాపురం, రాచర్ల గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో డీఆర్సీ ఏడీఏ శైలజ, మైక్రోఇరిగేషన్ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, ఏవోలు మధుకర్, శుభకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. విడపనకల్లు మండలంలో వేల్పుమడుగు, మాళాపురం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర పాల్గొన్నారు. బెళుగుప్ప మండలం కోనాపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఏఓ పృథ్వీసాగర్, హార్టికల్చర్ అధికారి కృష్ణతేజ, పశువైద్య అధికారి రమేష్, ఎంఏపీవో మల్లేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్, ఉంతకల్లు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఏఓ సాయికుమార్ , ఏఈఓ గోపాల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. గుమ్మఘట్ట మండల కేంద్రంలో జరిపిన కార్యక్రమం లో రాయదుర్గం వ్యవసాయ సంచాలకులు లక్ష్మణనాయక్, ఏఓ నిర్మల్‌కుమార్, సిరికల్చర్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.